క్లుప్తంగా

వైభవంగా బాలాజీ కల్యాణోత్సవం



అప్పనపల్లిలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: పాల్గుణ మాసం, బహుళ పక్షం, ఏకాదశి మంగళవారం అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి మాస కల్యాణం అంగ రంగ వైభవంగా జరిగింది. ఏడు కొండల వాడా... వెంకట రమణా, ఆపద మొక్కుల వాడా... అనాథ రక్షకా... ఆపద్బాంధవా... గోవిందా... గోవింద అంటూ భక్తులు స్వామి వారి దివ్య నామ స్మరణ చేస్తుండగా ఆలయ వేద పండితులు, అర్చక స్వాములు స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. శ్రీ, భూదేవిల శిరస్సుపై జీలకర్ర, బెల్లం పెట్టే సుమధుర ఘట్టాన్ని అర్చక స్వాములు వైభవంగా జరిపించారు. ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు దంపతులు కల్యాణంలో కర్తలుగా పాల్గొన్నారు. వారితో పాటు పలువురు భక్తులు స్వామి వారి కల్యాణానికి హాజరయ్యారు. కల్యాణం అనంతరం స్వామి వారిని దర్శించుకుని, అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. స్వామి వారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా కర్లమ్మ అమ్మవారి జాతర

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో వేంచేసిన గ్రామ దేవత కర్లమ్మ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. పచ్చని పంట పొలాల్లో కొలువుదీరి ఉండే ఈ అమ్మవారిని ప్రతి రెండేళ్లకోసారి గ్రామానికి తీసుకొచ్చి ఈ ఉత్సవాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆ గ్రామంలోని పాతూరు, కొత్తూరులో విడివిడిగా ఈ జాతరను నిర్వహించడం పరిపాటిగా మారింది. పాతూరులో గత బుధవారం రాత్రి జాతర నిర్వహించగా.. సోమవారం రాత్రి కొత్తూరులో జరిగింది.

గోదావరి బాలల కథల పుస్తకావిష్కరణ

ఆలమూరు: మండలంలోని చింతలూరులో మంగళవారం గోదావరి బాలల కథల పోటీల పుస్తక ఆవిష్కరణ జరిగింది. విద్యార్థుల్లో నైతిక విలువలు, పఠనాసక్తి పెంపొందించడానికి బాల మందిరం వ్యవస్థాపకుడు కృష్ణశ్రీ గోదావరి బాలల కథల పుస్తకాలను రచించారు. చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ ఆవరణలో మంగళవారం కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆ గోదావరి బాలల కథల పుస్తకాలను ఇటీవల కవితా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న 80 మంది విద్యార్థులకు అందజేశారు. ఎంపీడీఓ రాజు, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంఈఓ భమిడిపాటి అప్పాజీ, ఎస్సై ఎం.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో శ్రీనివాస్

రావులపాలెం: స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమం ఆశ్రమంలో శిక్షణ పొందుతున్న ఎనిమిది మంది విద్యార్థులు స్టేట్ యోగా పోటీలకు ఎంపికైనట్టు యోగా గురువు డాక్టర్ యోగా శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.మార్చి 9న కొత్తపేటలో జరిగిన జిల్లా యోగా పోటీల్లో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల నుంచి సుమారు వందమంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. కోనసీమ జిల్లా నుంచి రావులపాలెం యోగా ఆశ్రమంలో శిక్షణ పొందుతున్న ఆర్.లావణ్య, టి.పూజిత, ఎం.అనుదీప్తి, ఎస్.గ్రీష్మ భార్గవి, ఎ.శశిశ్రీ, కె.సత్య గంగాభవాని, బి.సురేష్, ఎల్.కార్తిక్ లు వైజాగ్‌లో ఈనెల 28దీన జరిగే రాష్ట్ర యోగా పోటీలకు ఎంపికైనట్టు యోగా గురువు శ్రీనివాస్ తెలిపారు.

పూర్వ వైభవం తీసుకురావాలి



ధర్మకర్తలతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మామిడికుదురు: ఆలయాలకు పూర్వ వైభవం తీసుకు వచ్చే దిశగా ఉత్సవ కమిటీలు పని చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. ఈదరాడ గ్రామ దేవత పోల్లమ్మ అమ్మవారి ఉత్సవ కమిటీ ప్రమాణ స్వీకారాన్ని మంగళవారం ఎమ్మెల్యే చేయించారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌గా సాధనాల సుబ్బారావు, సభ్యులుగా గుల్లింక గంగాధర్, యెరుబండి నాగేశ్వరరావు, కడలి వీవీ రమణ, యెరుబండి నాగేశ్వరరావు, పెదపూడి శ్రీను, అడపా వెంకటరత్నం పదవీ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమాతో పాటు కూటమి నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

నూకాంబిక భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలి

- పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి
- ఆర్డీవో శ్రీకర్, రూరల్ సీఐ విద్యాసాగర్ సూచన



చింతలూరు నూకాంబిక ఆలయంలో తీర్థోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆలమూరు: చింతలూరులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న నూకాంబిక అమ్మవారి జాతర తీర్థోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు అధిక ప్రాధాన్యం కల్పించడంతో పాటు కనీస సౌకర్యాలు అందించాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ కోరారు. స్థానిక నూకాంబిక అమ్మవారి ముఖ మండప ఆవరణలో మంగళవారం అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల నిర్వహణపై సమీక్ష జరిగింది. ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో శ్రీకర్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ పాల్గొని ఈనెల 28న ప్రారంభమయ్యే జాతర, తీర్థ మహోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తీర్థ మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు సక్రమంగా తాగునీటి సౌకర్యం కల్పించాలని, చంటిపిల్లలకు పాలను అందించాలని ఆర్డీవో శ్రీకర్ ఆదేశించారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అనువైన చోట్ల సామూహిక మరుగుదొడ్లను నిర్మించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఎక్కడికక్కడ పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు రావులపాలెం రూరల్ సీఐ తెలిపారు. దీంతో పాటు గ్రామ సచివాలయం వద్ద అవుట్ పోస్టును ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం లేకుండా భారీ పోలీసు బందోబస్తుతో విస్తృత రీతిలో పర్యవేక్షిస్తామని సీఐ పేర్కొన్నారు.

రక్షణ వాహనాల ఏర్పాటు

నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థంలో ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఫైరింజన్‌తో పాటు 108 వాహనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మండపేట ఫైర్ ఇన్‌స్పెక్టర్ జె.హనుమంతరావు, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ తెలిపారు. జాతర, తీర్థోత్సవాలకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో డీఎంకే దుర్గా ప్రసాద్ తెలిపారు. అలాగే రావులపాలెం, రామచంద్రపురం, రాజమహేంద్రవరం బస్ డిపోల నుంచి తీర్థోత్సవాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు తెలియజేశారు. విద్యుతీలంకరణ చేపట్టే సమయంలో జాగ్రత్తగా విద్యుత్ తీగలను జాగ్రత్తగా అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని ఈఓ వీర్రాజు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

ప్రత్యేక పూజలు

నూకాంబిక అమ్మవారిని డివిజన్, మండల స్థాయి అధికారులు దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆర్డీవో శ్రీకర్, ఎంపీడీఓ ఎ.రాజు, రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్సై ఎం.అశోక్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలుత ఆలయ మర్యాదలతో ఈఓ వీర్రాజు చౌదరి అధికారులందరికీ సాదర స్వాగతం పలికారు. తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్.రవికుమార్, జేఈ పి.పద్మ, హెచ్‌ఈ ఏవీవీ రాజా, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణ రక్షణ



కొత్తపేటలో హెల్మెట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ మురళీమోహన్

కొత్తపేట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ధారణ ప్రాణాలకు రక్షణ కవచమని స్థానిక డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కొత్తపేట, రామచంద్రపురం డివిజన్ల శాఖల సభ్యుడు, రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య సభ్యుడు సత్తిరాజు అదిత్యకిరణ్ తాను వ్యక్తిగతంగా వివిధ రంగాల కార్మికులకు హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం స్థానిక గౌతమి నగర్‌లో తన స్వగృహం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీమోహన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ) ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. డీఎస్పీ మురళీమోహన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదాల్లో వాహనదారుల తలకు ఏ చిన్న గాయం కాకుండా సురక్షితంగా ఇంటికి చేరేందుకు హెల్మెట్ ధారణ తప్పనిసరని అన్నారు. మనిషి అవయవాల్లో దేనికి గాయమైనా పెద్ద ప్రమాదం కాదని, అదే తలకు ఏ మాత్రం గాయమైనా ప్రాణాంతకమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. ఎవరికి వారు మనం నిదానంగా వాహనాన్ని నడుపుతూ జాగ్రత్తగా ప్రయాణిస్తున్నామని అనుకుంటారు. అయితే ఎదురుగా వచ్చే వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ దూకుడుగా వచ్చి ఢీకొడితే రెండు వాహనదారులు ప్రమాదానికి గురవుతారని హెచ్చరించారు. అందువల్ల హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యం చేయకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని సూచించారు. వివిధ రంగాల కార్మికుల ప్రాణ రక్షణ కాంక్షిస్తూ ఆదిత్యకిరణ్ హెల్మెట్ల వితరణకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం డీఎస్పీ మురళీమోహన్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణ చేతుల మీదగా మోటార్ సైకిళ్లపై అరటి మార్కెట్‌కు అరటి గెలలు తరలించే రైతు కూలీలు, గ్యాస్ డెలివరీ బాయ్స్, నర్సులు సుమారు 60 మందికి హెల్మెట్లు ఉచితంగా అందచేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు తమ్మన సాయిప్రసాద్, గమిడి శ్రీనివాస్, ఎస్.భీమేశ్వరరావు, బోనం రాజు, పట్నాల రమణ, గుర్రం రామకష్ణ, టీఎస్ఎన్ రెడ్డి, బాలరాజు, శేఖర్, జి.తేజ, జి.నాగు, సత్తిబాబు, వి.సత్యం, ఫీల్డ్ కోఆర్డినేటర్ రత్నంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు బహుమతులు



రాజమహేంద్రవరంలో నగదు ప్రోత్సాహక నమూనా చెక్కు అందుకుంటున్న కొత్తపేట విద్యార్థినులు

కొత్తపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉత్తమ విద్యార్థినులు 18 మందికి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఏటా ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థినులకు మాత్రమే అ మలబార్ గోల్డ్-డైమండ్స్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రతి సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రమే చదివే ఉత్తమ విద్యార్థినులకు ఈ ప్రోత్సాహకాలు అందజేస్తారు. ఈ ప్రోత్సాహకాలకు కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి వివిధ విభాగాల్లో 18 మంది ఎంపికయ్యారు. మంగళవారం రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, కొవ్వూరు ఎమ్మెల్యే ముని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ ఉప సంచాలకురాలు ఐ.నారద, తూర్పుగోదావరి జిల్లా ఏవీఈడీ జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాల నమూనా చెక్కు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల తరఫున అధ్యాపకులు ఈ.మాధురి, ఎస్.ప్రియదర్శిని, తనికెళ్ల శాస్త్రి పాల్గొన్నారు. కళాశాల విద్యార్థినులను ప్రిన్సిపాల్ యాళ్ల లక్షణరావు, అధ్యాపకులు అభినందించారు.

శాకాహారం అమృతాహారం..

అంబాజీపేట: శాకాహారం అమృత ఆహారమని, జంతువులను ప్రేమించాలే తప్ప హింసించకూడదని పి.గన్నవరం గ్రామానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ బొరుసు ధనలక్ష్మి అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ అంబాజీపేట ప్రతినిధి పళ్ళ భాగ్యలక్ష్మీకుమారి ఆధ్వర్యంలో సామూహిక ధ్యాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పిరమిడ్ మాస్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ మానవులందరికీ ధ్యానం అన్ని సమస్యలకు పరిష్కార మార్గమని, మన నాసికా రంధ్రాల ద్వారా లోనికి, బయటకు వచ్చే గాలిని గమనించడమే ధ్యానమని, అటువంటి ధ్యానాన్ని నేటి తరం వారంతా ఆచరించాలనే బ్రహ్మశ్రీ పితామహ సుభాష్ పత్రీజీ ఎంతో కృషి చేశారన్నారు. భూమ్మీద సజీవంగా ఉన్న ప్రతి వ్యక్తి జీవితంలో ధ్యానం భాగమైపోవాలని సుభాష్ పత్రీజీ ఆకాంక్షించారని అన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళా ధ్యానులు పాల్గొన్నారు.

రీ సర్వేకు ప్రజలు సహకారం అందించాలి



బి.దొడ్డవరం గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

మామిడికుదురు: ప్రజల సమక్షంలో పూర్తి పారదర్శకంగా రీ సర్వే నిర్వహిస్తారని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి తెలిపారు. బి.దొడ్డవరం గ్రామంలో మంగళవారం జరిగిన రీ సర్వే గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. రీ సర్వే చేపట్టే గ్రామాల్లో ముందుగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి ఆ సభలో గ్రామానికి సంబంధించిన మొత్తం భూమి వివరాలను తెలియజేస్తారన్నారు. ఏ రోజు రీ సర్వే చేపడతారో రైతులకు ముందుగా సమాచారం అందించిన తర్వాతే రైతుల సమక్షంలోనే రీ సర్వే చేస్తారన్నారు. భూములకు సంబంధించిన పక్కా సమాచారం నిర్ధారణ కొరకు ఈ సర్వే జరుగుతుందని చెప్పారు. ప్రజలు రీ సర్వేకు పూర్తిగా సహకారం అందించాలని కోరారు. గ్రామసభలో సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు, డీటీ శరణ్య, వీఆర్వో బాలాజీ, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని పోతుకుర్రు, చింతనలంక గ్రామాల్లో రీ సర్వేను ప్రారంభించామని ఈ గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ కోరారు. మంగళవారం తహశీల్దార్ నాగలక్ష్మమ్మ చింతనలంక, పోతుకుర్రు గ్రామాల్లో రీ సర్వేపై అవగాహన కలిస్తూ ర్యాలీ నిర్వహించారు.

బంగారు మురుగు షార్ట్ ఫిల్మ్ షూటింగ్



అంబాజీపేటలో జరుగుతున్న షార్ట్ ఫిల్మ్ షూటింగ్

అంబాజీపేట: సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన కుటుంబాల్లో అమ్మమ్మ, నాయనమ్మలతో, మనుమలుతో ఉండే సంబంధ బాంధవ్యాలు తెలియజేప్పే విధంగా 'బంగారు మురుగు' షార్ట్ ఫిల్మ్ చిత్రీకరిస్తున్నట్లు డైరెక్టర్ డొక్కా ఫణి చెప్పారు. స్థానిక విలేకరులతో ఫణి మాట్లాడారు తాను పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన డొక్కా సీతమ్మ వంశానికి చెందిన వాడినని చెప్పారు. మిథునం సినిమా రచయిత శ్రీరమణ స్ఫూర్తితో 2014లో అంబాజీపేట మండలం వ్యాఘ్రేశ్వరంలో పల్లకి అనే షార్ట్ ఫిల్మ్ తీశానని దానికి బంగారు నంది అవార్డు లభించిందన్నారు. అదే స్ఫూర్తితో ముత్యాల పల్లకీ క్రియేషన్స్ బ్యానర్ పై 'బంగారు మురుగు' షార్ట్ ఫిల్మ్‌ను చిత్రీకరిస్తున్నట్లు డైరెక్టర్ ఫణి వివరించారు. బంగారు మురుగు ఇతి వృత్తాంతాన్ని వివరిస్తూ ప్రస్తుత యాంత్రిక జీవనంలో 1960 నుంచి 80వ దశకం వరకు కుటుంబాల్లో అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలతో ఉండే ఆప్యాయతలు, అనురాగాలు, దూరమవుతున్నాయని, మానవ విలువలు ఎటుపోతున్నాయో అర్థమవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఆనాటి బాంధవ్యాలను జ్ఞప్తికి తీసికొని రావటంలో భాగంగా బంగారు మురుగు షార్ట్ ఫిల్మ్ చిత్రీకరిస్తున్నట్లు డైరెక్టర్ ఫణి వివరించారు. అంబాజీపేట మండలం మాచవరం శివారు కోతి వారి అగ్రహారం పరిసర ప్రాంతాలలో సుమారు 10 రోజుల పాటు షార్ట్ ఫిల్మ్‌కు అవసరమైన వివిధ సన్నివేశాలను చిత్రీకరిస్తామని ఒకరోజు గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో షూటింగ్ తీస్తామన్నారు. ఈ షార్ట్ ఫిల్మ్‌లో ప్రముఖ నటుడు తనికెళ్ళ భరణి, పోలాప్రగడ జనార్దనరావు(జెన్నీ), రత్నసాగర్, గుండు సుదర్శన్ తదితరులు నటించనున్నారని డైరెక్టర్ ఫణి తెలిపారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



పల్లిపాలెంలో కాలిపోతున్న ఇల్లు

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామ శివారు పల్లిపాలెంలో మంగళవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక రెల్లు గడ్డి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని సర్వం కాలిపోవడంతో పట్టా ఆదియ్య, పట్టా సురేంద్ర కుటుంబాలు కట్టు బట్టలతో వీధిన పడ్డారు. ఆస్తిఖత నష్టం సుమారు రూ.మూడు లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే రాజోలు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. పలువురు స్థానికులు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

పోషకాహార ప్రాముఖ్యతను వివరించండి



ఈదరాడ శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ విజయశ్రీ

మామిడికుదురు: గర్భిణులు, తల్లులకు పోషకాహారం ప్రాముఖ్యతను వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలని ఐసీడీఎస్ సీడీపీఓ వై.విజయశ్రీ సూచించారు. ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న పోషణ్ భీ, పఢాయి భీ రెండో రోజు శిక్షణలో ఆమె పాల్గొన్నారు. గర్భిణులు, తల్లులు, చిన్నారులు విధిగా పోషకాహారం తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోషకాహారం తీసుకోకపోవడం వల్ల జరిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించాలన్నారు. పోషకాహార లోపంతో ఎంతో మంది అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. అందుకే ప్రభుత్వాలు పోషకాహారం ప్రాధాన్యతను వివరిస్తూ ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రధానంగా ఇదే అంశంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.సుబ్బలక్ష్మి, పి.విజయలత, బి.అన్నపూర్ణ, హెచ్‌ఎం జి.సాయిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ, పఢాయి భీ కార్యక్రమంపై శిక్షణ తరగతి నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ వైకేడీ రమాదేవి మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, పిల్లలకు ఆరేళ్ల వయస్సులోనే 85 శాతం మెదడు అభివృద్ధి చెందుతుందని, ఆ వయస్సులోనే సరైన పోషణ, విద్యను అందించడం ఎంతో అవసరం అన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ్ భీ, పఢాయి భీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయని ఆమె చెప్పారు. ఎంపీపీ వీరా మల్లిబాబు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ, అంగన్‌వాడీ పిల్లలకు మంచి పోషకాహారం, విద్య అందించాలని కోరారు.

జొన్నాడలో..

ఆలమూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమూల మార్పులను తీసుకురావడం ద్వారా చిన్నారులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించి అభ్యాసన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయని జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతికుమారి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలమూరు మండలంలోని జొన్నాడ జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ బీ- పఢాయి బీ అనే పథకం పై అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చే మూడు రోజుల శిక్షణను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులను అంగన్వాడీ కార్యకర్తలంతా సద్వినియోగం చేసుకుని అవగాహన కల్పించుకుని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. కొత్తపేట ఐసీడీఎస్ పీఓ అధికారి గజలక్ష్మి, సూపర్‌వైజర్లు టీఎస్వీ నాగలక్ష్మి, వై.అరుంధతి, ఎస్కే ఫాతిమా, వై.హిమశ్రీ పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను త్వరగా పరిష్కరించాలి



పి.గన్నవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చామన్నారు. రాబోయే రెండేళ్లలో రహదారి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. గత నెలలో మృతి చెందిన ఎల్.గన్నవరం సర్పంచ్ పసలపూడి రామకృష్ణకు సమావేశం నివాళులు అర్పించింది. తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీడీఓ కె.విజయ ప్రసాద్, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, ఎంఈఓ కోన హెలీనా, కోఆప్షన్ సభ్యుడు షేక్‌దొరబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

షేర్ ధనం పై డివిడెండ్ ఇవ్వాలి



డివిడెండ్ ఇవ్వాలని హుస్సేన్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘ నాయకులు

అయినవిల్లి: షేర్ ధనంపై డివిడెండ్ ఇవ్వాలని నేదునూరు పీఏసీఎస్‌కు చెందిన రైతులు పీఏసీఎస్ ప్రత్యేక అధికారి ఆలీ హుస్సేన్‌ను డిమాండ్ చేశారు. మంగళవారం పీఏసీఎస్ సీఈఓ గోకరకొండ లక్ష్మణరావు అధ్యక్షతన మహాజన సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఆలీ హుస్సేన్ హాజరయ్యారు. సమావేశంలో 2025–26కు చెందిన అంచనా బడ్జెట్ తీర్మానం ప్రవేశపెట్టగా సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. రైతు సంఘ నాయకులు తమకు చాలా కాలంగా షేర్ ధనంపై డివిడెండ్ ఇవ్వడం లేదని తక్షణమే డివిడెండ్ ఇవ్వాలని ప్రత్యేక అధికారి ఆలీ హుస్సేన్ కోరారు. అనంతరం ఆయనకు వినతి పత్రం అందజేశారు.

అన్ని గ్రామాలూ సారా రహితం కావాలి



వెలిచేరులో మహిళా సదస్సులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వరప్రసాద్

కొత్తపేట: అన్ని గ్రామాలు సారా రహిత గ్రామాలు కావాలని, అందుకు ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ కోరారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలంలోని వెలిచేరులో సర్పంచ్ వేముల శ్రీనివాస్ అధ్యక్షతన సారాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో వెలిచేరు, రాజవరం, పేరవరం గ్రామాలను కొత్తపేట ఎక్సైజ్ ఎస్సై కె.అన్నవరం దత్తత తీసుకుని, సిబ్బందితో కలసి విస్తృతంగా దాడులు నిర్వహిస్తూ సారా తయారు, విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఫలితంగా ఆయా గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దారని, ఈ నేపథ్యంలో ఆ గ్రామాలను ఆదర్శంగా తీసుకుని అన్ని గ్రామాలను సారా రహిత గ్రామాలుగా మార్చేందుకు ఎక్సైజ్ శాఖ ప్రయత్నాలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. అనంతరం టోల్ ఫ్రీ నంబర్ 14405 వాల్‌పోస్టర్‌ను ఈఎస్ ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని, ఎస్సై కె.అన్నవరం, తహసీల్దార్ పి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం... ఆరోగ్యం పదిలం



ఇరుసుమండలో రైతులకు కిట్లను ఇస్తున్న ఏడీఓ

అంబాజీపేట: సేంద్రియ విధానంలో సాగు చేసే పంటలు మానవాళికి ఎంతో మేలు చేసి ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుతాయని పి.గన్నవరం ఏడీఏ రామమోహనరావు అన్నారు. ఇరుసుమండ రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం ఏపీసీఎన్‌ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నాచురల్ ఫార్మింగ్) విభాగం ద్వారా విత్తనాలను 120 మంది రైతులకు ఏపీసీఎన్ఎఫ్ వ్యవసాయాధికారి కె.శ్రీనివాస్ అధ్యక్షతన మంగవారం పంపిణీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులకు దాళ్వా పంట అనంతరం భూమి పోషకాల పెంపుదలకు, పశువులకు నాణ్యమైన మేత పొందుటకు పీఎండీఎస్ (ప్రైమాన్‌సూన్ డ్రై సోయింగ్) 20 రకాల విత్తనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. 20 రకాల విత్తనాలను ఆరు కిలోల కిట్‌గా తయారు చేసి రైతులకు ఇస్తున్నామన్నారు. వక్కలంక, ముక్కామల, ఇరుసుమండ గ్రామాలకు రూ.450 విలువ చేసే కిట్లను 120 మందికి అందించామన్నారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్, రాధిక, ఎంటీ నాగవేణి, దుర్గాలక్ష్మి, వీఏఏ కిరణ్‌దుర్గ, రైతులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలతో విజ్ఞానాభివృద్ధి

మలికిపురం: పాఠ్యపుస్తకాల్లో ఉన్న ప్రయోగాలను ప్రత్యక్షంగా చేసి చూపించడం వలన విద్యార్థులతో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించవచ్చని రేవతి సైన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.కృష్ణసాయి అన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగాల కార్యశాల నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రపురం రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.కృష్ణ సాయి విద్యార్థులకు వివిధ సైన్స్ ప్రయోగాలను చేసి చూపించి విద్యార్థులలో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించారు. పాఠశాల కరెస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ ప్రయోగాలను గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు సైతం అందుబాటులోకి తెస్తూ, వారిలో సైన్స్ టెంపర్‌ను పెంచేందుకు కృషి చేస్తున్న కె.కృష్ణసాయిని అభినందించారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు పని చేయాలి

అంబాజీపేట: ప్రభుత్వం నిర్దేశించిన ఆదేశాలు, నిబంధనల మేరకు ఉపాధి హామీ పథకంలో పనులు పూర్తి చేయాలని జిల్లా ఏపీడీ డి.రాంబాబు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జీవీ సరోవర్ అధ్యక్షతన ఉపాధి హామీ పథకం మేట్లకు శిక్షణ తరగతిని మంగళవారం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ పని చేసే ప్రాంతం నుంచి వర్క్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో పొందుపర్చడంలో నిర్లక్ష్యం వహించవద్దన్నా రు. అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో అవసరమైన ప నులు గుర్తించి వాటి ఆమోదం తదితర అంశాలపై శిక్ష ణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఏపీఓ ఏవీ కృష్ణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి



చిరతపూడిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ప్రభుత్వ నిబంధనల మేరకు సీసీ రోడ్లను నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. చిరతపూడిలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న మెయిన్ రోడ్డును సర్పంచ్ కోట బేబీరాణితో కలసి ఎంపీపీ మంగళవారం పరిశీలించారు. శివారు ప్రాంత రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీతో పాటు ఎంపీడీఓ జీవీ సరోవర్, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు పాల్గొన్నారు.